సాగు పెరిగింది.. ధర తగ్గింది

- ఆరు నెలల క్రితం స్వీట్‌కార్న్ ధర రూ.1800.. నేడు రూ.1400
- మార్కెట్ లేక హైదరాబాద్‌కు తరలింపు


మార్కెట్‌కు తరలించటానికి సిద్ధంగా ఉన్న స్వీట్‌కార్న్


పెద్దేముల్ మండల బుద్దారంలో సాగవుతున్న మొక్కజొన్న

పెద్దేముల్: మండలంలో మొక్కజొన్న (స్వీట్‌కార్న్) సాగు పెరిగింది.. మొక్కజొన్నకు అనువైన నేలలు ఉండటం ... తక్కువ సమయంలో పంట చేతికి రావడం .. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం అర్జించడంతో రైతులు స్వీట్‌కార్న్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది క్వింటాకు రూ.1500 నుంచి రూ.1800ల వరకు ధర పలుకగా, ప్రస్తుతం రూ.1200 నుంచి రూ.1400లు ధర పలుకుతోంది. మార్కెట్ అందుబాటుల్లో లేక కర్షకులు పంటను విక్రయాలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. మొక్కజొన్న సాగు చేయడం వల్ల పశువుల మేతకు కూడా మంచి డిమాండ్ ఉండటంతో రైతులు మేత కోసం రెండు నెలల ముందుగానే అడ్వాన్స్‌గా చెల్లిస్తున్నారు. మరికొంత మంది రైతులు విత్తనం నాటే సమయంలో అడ్వాన్స్ ఇస్తున్నారు. దీంతో మండలంలో పశువుల మేతకు డిమాండ్ పెరిగింది. విత్తనాలు కిలో రూ.1500 నుంచి రూ.2000లు పలికిన రైతులు వెనుకడుగు వేయడం లేదు. విత్తిన నాటి నుంచి పంట చేతికి వచ్చే వరకు నాలుగుసార్లు మందు పిచికారీ, రెండుసార్లు డీఏపీ ఎరువులు, మూడు సార్లు కలుపు తీయడం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఏడాది కంటే ఈ ఏడాది కూడా మద్దతు ధర దక్కుతుందని మండలంలోని బుద్దారం, పెద్దేముల్, గాజీపూర్, హన్మాపూర్, తట్టెపల్లి, తింసాన్‌పల్లి,జనగాం, కందనెల్లి, గొట్లపల్లితో పాటు పలు గ్రామాల్లో రైతులు స్వీట్ కార్న్‌ను అధికంగా సాగుచేశారు. గత రెండు ఏళ్ల క్రితం మంచి లాభాలు రావడంతో రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్ అందుబాటులో లేక పెట్టుబడులు కూడా ఏటా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన సాగు..

మండలంలో 300 నుంచి 350 ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగుచేశారు. ఎరువులు, కూలీల ధరలతో పాటు విత్తనాలు, మందుల ధరలు పెరగడంతో ఎకరా పొలంలో సుమారు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పంట పెట్టుబడులు అవుతున్నాయని రైతన్నలు అంటున్నారు. కేవలం బుద్దారం, గాజీపూర్ గ్రామంలో 50ఎకరాలకు పైగా మొక్కజొన్న పంటను సాగుచేశారు.

రూ.2500 ధర ఉండాలి

స్వీట్‌కార్న్ ధర కనీసం రూ.2500 వేలు క్వింటాళ్లు పలికితే పెట్టిన పెట్టుబడులు పోను చేసిన కష్టానికి ఫలితం లభిస్తుంది. రూ.1200 నుంచి రూ.1400లు క్వింటాళ్లు ధర పలికితే ఎకరాకు రూ.5 నుంచి 10వేల వరకు నష్టం వస్తుంది.

మార్కెట్ లేక..

తాండూరు, వికారాబాద్, మర్పల్లి, సదాశివపేట ప్రాంతాల్లో మార్కెట్ లేక ఇక్కడి రైతులు హైదరాబాద్‌లోని బొయిన్‌పల్లి మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఒకనొక సమయంలో ధరలు లేక, గిట్టుబాటు కాక పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, కొన్ని సార్లు మొక్కజొన్న పంటకు వచ్చినంత లాభం ఏ పంటకు రాదని పలు గ్రామాల రైతులు అంటున్నారు. రైతన్నకు ఏ పంటలు అనుకూలించక పోవటంతో రైతులు గిట్టుబాటు ధర దక్కుతుందని ఏటా సాగు చేస్తుంటారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ధర అనుకూలంగా ఉంటుందని పలు గ్రామాల రైతులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

పండరీశ్వరుడి సన్నిధిలో ఎంపీపీ


పండరీపూర్‌లో ఎంపీపీ తదితరులు

కొడంగల్: ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పీఏసీఎస్ ఛైర్మన్ శివకుమార్ గుప్తా, కాంగ్రెస్ నాయకులు మురాహరివశిష్ట, శ్రీనివాస్‌రెడ్డిలు సోమవారం మహారాష్ట్రంలోని పండరీపూర్ వెళ్లారు. అక్కడి దివ్య క్షేత్రంలో వెలిసిన పండరీశ్వరుడిని దర్శించుకున్నారు. పండరీపూర్‌తో పాటు తుల్జాపూర్, షిర్డి వెళ్తున్నట్లు వారు తెలిపారు. కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు దైవ దర్శనానికి వెళ్లినట్లు చెప్పారు.

గోశాల అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి



తాండూరు టౌన్: తాండూరు గోశాల సేవా సమితి అధ్యక్షుడిగా పటోళ్ల బాల్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గోశాల సేవా సమితి అధ్యక్షుడిగా నియామకంపై సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గోశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పరిగి: నేడు (మంగళవారం) పరిగిలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉ.11 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరు అవుతారని, ఆయాశాఖల అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో రావాలని కోరారు.

8 నుంచి సమ్మెటీవ్ పరీక్షలు

ఎంఈఓ వెంకటయ్యగౌడ్

తాండూరు రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో ఈ నెల 8 నుంచి 20వ వరకు సమ్మెటీవ్ –2 పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటవ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఉ.9 గంటల నుంచి 11 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 11.45 నిమిషాల వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 23వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినంగా ఎంఈఓ ప్రకటించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

దోమ : రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని పీఏసీఎస్ సీఈఓ యాదగిరి సూచించారు. సోమవారం మండలంలోని బ్రహ్మణపల్లి రైతు వేదికలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం విక్రయించుకునేందుకు వెసులుబాటు కల్పిస్తుందన్నారు. ఏ గ్రేడ్ ధర రూ. 2,203 ఉండగా, బీ గ్రేడ్ ధర రూ.2,183 కల్పిస్తూ రైతుల ధాన్యాలను కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రతి రైతు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోని లబ్ధిపొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ బాబ్య, రైతులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలతో లబ్ధి


వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కుల్కచర్ల: రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు సుగుణాబాయి, రాజేశ్వర్‌లు పేర్కొన్నారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. ఒక క్వింటాళకు ఏ గ్రేడ్ 2203, బీ గ్రేడ్ 2183 మద్దతు ధరను అందించడం జరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం శోభ, సీసీ వెంకటయ్య, మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ కనెక్షన్లను పునరుద్ధరించండి

బీఆర్‌ఎస్ నేత రవీందర్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యాలాల: కాగ్నానది నుంచి కొడంగల్ వరకు గతంలో వేసిన మంచినీటి సరఫరా పథకంలో భాగంగా యాలాల మండలంలోని గ్రామాలకు పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చి న్యాయం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల గౌరవ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యుడు, చెన్నారం మాజీ సర్పంచ్ శివకుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో కొడంగల్ వరకు ఉన్న మంచినీటి సరఫరా పైప్‌లైన్ నుంచి మండలంలోని 9 గ్రామాలకు మంచినీటి సరఫరా అయ్యేదన్నారు. మిషన్ భగీరథ పూర్తయిన తరువాత మంచినీటి సరఫరా పథకం నిలిచిపోయింది. కాగా, ఇటీవల చేపడుతున్న జాతీయ రహదారి వెడల్పు పనుల్లో భాగంగా కాగ్నానది నుంచి కొడంగల్ వరకు కొత్తగా పైప్‌లైన్లు వేస్తున్నారు. అయితే, ప్రస్తుతం చేపడుతున్న పైప్‌లైన్ పనులతో పాటు గతంలో ఉన్న మాదిరిగా మండలంలోని లక్ష్మీనారాయణపూర్, అగ్గనూరు. మల్‌రెడ్డిపల్లి, చెన్నారం, అక్కంపల్లి, దౌలాపూర్, గిరిజాపూర్, తిమ్మాయిపల్లి, బండమీదిపల్లి గ్రామాలకు సైతం తాగునీటి కనెక్షన్లను పునరుద్ధరించాలన్నారు. స్థానిక వనరులను స్థానిక గ్రామాలకే చెందాలని కోరారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టిసారించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. జాతీయ రహదారి పనులను పూర్తి కాకముందే ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ఛైర్మన్ వడ్డే రాములు, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, అరవింద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్యగౌడ్, నాయకులు లక్ష్మప్ప, కృష్ణకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొత్త పంచాంగం ఆవిష్కరణ


పంచాంగం ఆవిష్కరిస్తున్న సభ్యులు

కొడంగల్ రూరల్: బహ్మశ్రీ శశిభూషణ సిద్ధాంతి రాసిన క్రోధి నామ సంవత్సరం నూతన పంచాంగాన్ని సోమవారం ఆవిష్కరించారు. కోస్గిలో జరిగిన కార్యక్రమంలో జంగమ సమాజం గౌరవ అధ్యక్షుడు రుమాళ్ల మల్లిఖార్జున్, అధ్యక్షుడు హంపయ్య, నారాయణపేట జిల్లా కన్వీనర్ రుద్రాక్షల మఠం అమర లింగస్వామి, జంగమ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు శ్రీమఠం మహేశ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కోస్గిలోని ఇంద్రనీలేశ్వర స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు శివశ్రీ మఠం హంపయ్య స్వామివారి ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో సారంగదర మఠం మల్లికార్జున్, వినయ్, విశ్వనాథ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా మాధవరెడ్డి శత జయంతి


గీతాయజ్ఞం చేస్తున్న దృశ్యం


గీతా పారాయణంలో అర్చకులు

తాండూరు టౌన్ : కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన శత జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాండురంగ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గీతాయజ్ఞం, గీతాపారాయణం నిర్వహించారు. అన్నదాన ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో శివానంద స్వామి, శంకర్‌జీ స్వామి, మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ కొ్ట్రిక విజయలక్ష్మి, ఆలయ ధర్మకర్తలు మేడిశెట్టి చంద్రకళ, జగన్నాథం, నాగలక్ష్మి, అంజిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి


మాట్లాడుతున్న లింగ్యా నాయక్

కొడంగల్: పార్లమెంట్ ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం ఎన్నికను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకుల సహకారం అవసరమని పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ గురించి వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో నిబంధనలు పాటించాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 275 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీలు సురేశ్, మహేష్‌గౌడ్, అఖిల పక్ష నాయకులు ఇందనూర్ బషీర్, రమేష్‌బాబు, గుల్షన్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


జేసీబీతో కూల్చివేయిస్తున్న అధికారులు

చేవెళ్ల: అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ హెచ్చరించారు. శంకర్‌పల్లి మండలంలోని జన్వాడలో సోమవారం ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వాటిని పంచాయతీ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్వాడ గ్రామ పరిధిలో అనుహార వెంచర్‌లో వంశీశర్మ, దీపికారెడ్డి, అవినాశ్‌రెడ్డి, కేవీరెడ్డిలు హెచ్‌ఎండీఏతో పాటు గ్రామ పంచాయతీ నుంచి కూడా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. గతంలో ఈ నిర్మాణాలకు సంబంధించి మూడుసార్లు నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో పాటు నిర్మాణాలు అలాగే కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో చట్టప్రకారం ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవటంతో డీఎల్‌పీఓ సతీశ్, ఎంపీఓ గీతల ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు తెలిపారు. వీరే కాదు ఎవరైనా సరే ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు పాటించి అనుమతులు పొందిన తరువాతే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

నూతన నియామకం


బీజేపీ నూతన ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి

నవాబుపేట: బీజేపి మండల నూతన ఇన్‌చార్జిగా పులుమామిడికి చెందిన బీజేపీ నాయకుడు సోమన్నొళ్ళ రామకృష్ణారెడ్డిని నియమించినట్లు జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, చేవెళ్ల ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నంలు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల బాధ్యతలు అప్పగించినందుకు మాధవరెడ్డి, కేఎస్ రత్నంలకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో మండలంలోని నాయకులందరిని కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బీజేపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. లోకసభలో ఎన్నికల్లో మండలంలో బీజేపీ అభ్యర్థికి భారీ మెజార్టీ తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల జాయింట్ కన్వీనర్ రమేష్, కార్యదర్శి జన్, దళిత మోర్చా అధ్యక్షుడు గాలయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్, అర్జున్ తదితరులు ఉన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి ఉత్సవాలు


నిర్వాహకులతో భీంభరత్, మండల నాయకులు

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో గ్రామస్తులు మల్లికార్జునస్వామి, బీరప్ప ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పాల్గొని స్వామివార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మండలానికి చెందిన నాయకులు మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఉదయ్‌మోహన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఎండీ ఎజాజ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, రాములు, సంతోష్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్తులు పూజల్లో పాల్గొన్న వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

మల్కాపూర్‌లో పర్యటించిన ఎంపీడీఓ విశ్వప్రసాద్


వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఎంపీఓ రతన్‌సింగ్‌తో కలిసి మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మల్కాపూర్ గ్రామంలోని 1వ వార్డు, 2వ వార్డులో తాగునీటి సమస్యపై క్షేత్రస్థాయిలో వెళ్లి వివరాలు సేకరించినట్లు చెప్పారు. బోరు మోటారు రిపేరయిందని వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు. మంగళవారం నుంచి ఆయా వార్డుల్లో నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. కాలనీ వాసులు ఇబ్బందులు పడకుండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటిని సరఫరా చేశామన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం మల్కాపూర్‌లోని వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రవిసింధే ,నాయకులు పండరి,హసేన్ పటేల్‌లు ఉన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాండూరు టౌన్: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా పలు సంస్కరణలో తనదైన ముద్ర వేసిన జగ్జీవన్ రామ్ సేవలకు గుర్తుగా ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు మార్గంలో స్థలాన్ని కేటాయిస్తే, ఏప్రిల్ 5వ తేదీన ఆయన జయంతి సందర్భంగా విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లు చేసుకుంటామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నర్సింహులు, స్వామిదాస్, ప్రకాశ్, మహేందర్, సూర్యప్రకాష్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

వరి పంటకు మొగిపురుగు బెడద

వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్


వరి కంకుల్ని పరిశీలిస్తున్న సంజూరాథోడ్

ధారూరు: వరిలో కాండం తొలుచు పురుగును వరినారు వేసే ముందే నివారించవచ్చని ధారూర్ వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని గట్టెపల్లి గ్రామ రైతు నరేందర్ వరి పంటను పరిశీలించారు. ఈనిన దశలో ఉన్న వరికి మొగిపురుగు ఆశించి కాండాన్ని తినేయడం వల్ల తెల్ల కంకులు ఏర్పడి పంట నష్టం సంభవిస్తుందన్నారు. నాటే ముందు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి క్రిమి సంహారక మందులు, పురుగు నివారణ గుళికలు వేసుకునే అవసరం ఉండదని చెప్పారు. వరిలో మొగి పురుగు నివారణకు పొలంలో నారు వేసేటప్పుడు కొనలు తుంచివేసి నాటుకోవాలని ఆయన సూచించారు. వరి ఆకు కింది భాగంలో క్రిమిగుడ్లు పెడుతుందని, కొనలు తుంచడం వలన కాండం తొలుచు పురుగును నివారించవచ్చని తెలిపారు. ఈ పురుగు మొదళ్ల కింద నష్టం చేస్తుందని తెలిపారు. వరి పంట పాలు పోసుకునే దశలోనే గింజలు తాలుపోయి తెల్లగా మారిపోయి పంట దిగుబడి తగ్గుతుందని వివరించారు. పురుగు నివారణకు 10 కిలోల 3జీ గుళికలను 10 గంపల ఇసుకతో కలిపి చల్లుకోవాలని చెప్పారు. కాండంను లోపలి నుంచి తినేయడం వలన కంకులు తెల్లబడతాయన్నారు. లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాముల మందును ఒక ఎకరం వరి పొలానికి పిచికారీ చేసుకోవచ్చని తెలియజేశారు.

సాయం చేయడంలోనే సంతృప్తి


రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఇక్బాల్

అనంతగిరి: మనం సంపాధించిన దాంట్లో నుంచి కొంత పేదలకు సాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని ప్రముఖ వ్యాపారవేత్త సయ్యద్ ఇక్బాల్ అన్నారు. ఈ మేరకు రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆయన సోమవారం వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేటలోని తన నివాసంలో పేద ముస్లిం కుటుంబాలకు పండుగ సామగ్రితో కూడిన రంజాన్ పండుగ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 6 సంవత్సరాలుగా రంజాన్ కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈసారి 1400 మందికి అందజేశామన్నారు. అందరూ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేసిన రాజశ్రీ

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని వరంగల్ సుమతి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీ తెలిపారు. మండల పరిధిలోని జేబీఆర్‌ఈసీ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజశ్రీ పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఉన్నత విద్యలో క్రమశిక్షణ అలవరచుకుంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జితేందర్‌రెడ్డి, ఏవో కె.వి.శ్రీనివాస్‌రావు, అరుణ్‌మూర్తి, జగ్గా రాజు, ప్రభాకర్, అబ్దుల్‌రహీం, శ్రీనివాస్, ప్రసాద్, శేషగిరి, రమేశ్, నవీన్, జోత్స్న, గోపాల్, రవికుమార్, రాహుల్, మన్సూర్ పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం


సమావేశానికి వెళ్తున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, నాయకులు

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తామని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చేవెళ్లలో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి షాబాద్ మండలం నుంచి 150 వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం 110 రోజుల్లోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. రాష్ట్రంలో పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి సామాన్య ప్రజలకు అండగా నిలిచిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అండగా నిలిచిందన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఎన్నికల్లో తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని మూడోసారి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని సూచించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కో–ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కుమ్మరి దర్శన్, దయాకర్‌చారి, దర్శన్, రాంమోహన్‌గుప్తా తదితరులున్నారు.